# బలగం BALAGAM TV

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ బుధవారం 26 మార్చి 2025 | www.balagamtv.com | పేజీలు 4


## రైతుల ఖాతాల్లో రూ.200 కోట్లు జమ

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

రైతు భరోసా కింద రూ.500 కోట్ల నిధులను రాష్ట్ర ప్ర భుత్వం విడుదల చేసింది. మూడు నుంచి నాలుగు ఎకరాలలోపు వారికి ఈ నిధులు జమ చేస్తున్నారు. మంగళవారం రూ. 200 కోట్లు రైతుల ఖాతాల్లోకి జమ చేశారు. మరో రెండు రోజుల్లో నాలుగు ఎకరాల వరకు రైతు భరోసా పూర్తి చేయనున్నారు. అనంతరం నాలుగు నుంచి బడెకరాల వరకు రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తారు. ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వం మొత్తం 54 లక్షల 74 వేల రైతులకు రూ.4,666.57 కోట్ల రైతు భరోసా నిధులు విడుదల చేశారు. కాగా.. గత ఫిబ్రవరి నెలలో రెండెకరాల వరకు ఉన్న రైతులకు రైతుభరోసా కింద రూ.2,223,46 కోట్ల నిధులను ప్రభుత్వ విడుదల చేసింది.

# 3న కొత్త మంత్రులు



బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర మంత్రివర్గ విస్తరణ ప్రక్రియ ఓ కొలిక్కొచ్చినట్టు సమాచారం. అనుకున్నది అనుకున్నట్టుగా జరిగితే.. అన్నీ కుదిరితే వచ్చే నెల మూడో తేదీనే కొత్త మంత్రులు ప్రమాణం చేస్తారని విశ్వసనీయ సమాచారం. ఇప్పటికే కాంగ్రెస్ అధిష్ఠానం విస్తరణకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన నేపథ్యంలో అక్కడి నుంచి ఆదేశాలు రాగానే...సంబంధిత జాబితాను విడుదల చేయనున్నారు. ఈ మేరకు సిద్ధంగా ఉండాలంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌కు ఆ పార్టీ హైకమాండ్ సూచించింది. కాగా ఇటీవల నిర్వహించిన ఏఐసీసీ భేటీలో క్యాబినెట్ విస్తరణకు సంబంధించి పెద్ద కసరత్తే జరిగినట్టు సమాచారం. ప్రస్తుతమున్న ఆరు బెర్తులను నింపాలా? లేక నాలుగే నింపాలా అనే అంశంపై తర్జన భర్జనలు జరిగినట్టు వినికిడి. మరోవైపు ప్రస్తుతమున్న మంత్రుల్లో ఇద్దరిని తొలగించి, వారి స్థానంలో కొత్త వారికి అవకాశమిస్తే ఎలా ఉంటుందనే చర్చ కూడా జరిగింది. అయితే ఇప్పటికిప్పుడు ఉన్న మంత్రుల్లోంచి ఇద్దరిని తొలగిస్తే, లేనిపోని సమస్యలు ఎదురయ్యే అవకాశముందని అధిష్ఠానం అంచనా వేసింది. మనస్పర్థలు, గ్రూపు రాజకీయాలు కొనసాగితే అది అంతిమంగా పార్టీకే నష్టం చేకూరుస్తుందనే అంచనాకు హైకమాండ్ వచ్చినట్టు హస్తం పార్టీ నేతలు తెలిపారు. మరోవైపు ఆశావహులు, సీనియర్ నేతల అనుయాయులను ఇబ్బంది పెట్టకుండా ఆరింటిలో నాలుగు ఖాళీలను భర్తీ చేసి, మిగతా రెండింటిని వదిలేస్తే...నాయకులందర్నీ సంతృప్తి పరచొచ్చనే అభిప్రాయానికి ఏఐసీసీ వచ్చిందని వారు తెలిపారు. అందులో భాగంగా కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, వాకిటి శ్రీహరి, గడ్డం వివేక్‌తోపాటు హైదరాబాద్‌కు చెందిన ఓ మైనార్టీ నేతకు క్యాబినెట్‌లో చోటు కల్పించేందుకు నిర్ణయించినట్టు సమాచారం. ఇలా చేస్తే ఏమైనా ఇబ్బందులొస్తాయని భావిస్తే... రెడ్డి సామాజిక వర్గానికి రెండు (కోమటిరెడ్డి రాజగోపాలరెడ్డి, నిజామాబాద్ జిల్లాకు చెందిన సీనియర్ నేత సుదర్శన్‌రెడ్డి లేదా మల్‌రెడ్డి రంగారెడ్డి) బీసీలకు మరో రెండు (వాకిటి శ్రీహరి, వీర్లపల్లి శంకర్ లేదా బీర్ల ఐలయ్య) మంత్రి పదవులను కేటాయించేందుకు నేతలు యోచిస్తున్నట్టు తెలుస్తోంది. అయితే ఎక్కువ మంది మొదటి ప్రతిపాదనకే అంగీకరించారు. ఈ క్రమంలో ఏప్రిల్ మూడున లేదా అదే నెల మొదటి వారంలో జరిగే మంత్రివర్గ విస్తరణ సర్వత్రా చర్చనీయాంశమవుతున్నది.

# అసెంబ్లీలో లిక్కర్ గొడవ..

- ఆదాయం కోసం లిక్కర్ ధరలు పెంచుతున్నారు
- మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి
- బీఆర్ఎస్ హయాంలో రేషన్ షాపుల్లోనూ లిక్కర్ అమ్మారు
- మంత్రి శ్రీధర్ బాబు
- బెల్ట్ షాపులను ఎంకరేజ్ చేయబోమన్న మంత్రి





బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

కొత్త మద్యం పాలసీ, బెల్టు షాపుల నిర్వహణపై అసెంబ్లీలో వాడీవేడి చర్చ జరిగింది. దీనిపై మంత్రి శ్రీధర్ బాబు, మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి మధ్య మాటల యుద్ధం చోటు చేసుకుంది. రాష్ట్ర ప్రభుత్వం ఆదాయం పెంచుకునేందుకు లిక్కర్ రేట్లు అడ్డగోలుగా పెంచుతోందని, కొత్త మద్యం పాలసీని వెంటనే విత్ డ్రా చేసుకోవాలని మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. కొత్త ప్రభుత్వం.. కొత్త బ్రాండ్లు.. కొత్త బీర్లు, కొత్త బార్లు, కొత్త పబ్‌లు ఇదేనా ప్రభుత్వ పాలసీ అని ప్రశ్నించారు. రాష్ట్రవ్యాప్తంగా బెల్టు షాపులు తీసేయాలని డిమాండ్ చేశారు. ఆదాయ మార్గాన్ని పెంచేందుకు బెల్టు షాపులను పెంచే ప్రయత్నం చేస్తున్నారన్నారు. దీనికి శాసన సభా వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కౌంటర్ ఇచ్చారు. బీఆర్ఎస్ హయాంలోనే అడ్డగోలుగా.. ఇష్టానుసారంగా మద్యం అమ్మకాలు జరిపారని ఫైర్?అయ్యారు. ఆఖరికి రేషన్షాపుల్లో కూడా లిక్కర్ సేల్స్‌కు పర్మిషన్ ఇచ్చిన చరిత్ర బీఆర్ఎస్‌కు ఉందన్నారు. బెల్టుషాపులపై వారు తీరు దెయ్యాలు వేదాలు వల్లించినట్టు ఉందని సెటైర్‌వేశారు.

బెల్టు షాపులు తామే తెచ్చామని ప్రశాంత్ రెడ్డి ఒప్పుకోవడం సంతోషకరం. బెల్టు షాపులు మేం పెంచలేదు. అలాంటివి మేం ఎంకరేజ్ చెయ్యబోం. ప్రభుత్వంలో లీకేజెస్ ఉండొద్దు అనే ఆదాయం పెంచుతామన్నం. బీఆర్ఎస్ హయాంలో అడ్డగోలుగా ఇష్టారాజ్యంగ చౌక షాపుల్లో మద్యం అమ్మకాలు జరిగాయి. ఎక్సైజ్ శాఖలో లీకేజెస్ లేకుండా సర్కార్ చేపడుతుంది. అడ్మినిస్ట్రేషన్ లో రీఫామ్ తెస్తాం. దీని వల్ల రెవెన్యూ పెంచుకుంటాం' అని మంత్రిశ్రీధర్‌బాబు తెలిపారు.

## గతంలో అసెంబ్లీని ప్రజలు ఆసక్తిగా చూసేవారు

- మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే మల్లారెడ్డి



బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే మల్లారెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. మల్లారెడ్డి అసెంబ్లీ ప్రాంగణంలో మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో.. అప్పటి అసెంబ్లీ సమావేశాలు.. ఇప్పుడు జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల మధ్య వ్యత్యాసాలను చెప్పుకొచ్చారు. గతంలో అసెంబ్లీని ప్రజలు ఆసక్తిగా చూసేవారని అన్నారు. ఇప్పుడు మాత్రం బట్టలు విప్పుడు, కత్తులు దూసుడే అన్నట్లుగా సమావేశాల్లో కనిపిస్తోందంటూ కామెంట్స్ చేశారు. పార్లమెంట్‌లో ఆనాడు మాజీ ప్రధాని వాజుపేయి లాంటి వారు మాట్లాడుతుంటే దేశ ప్రజలు ఆసక్తిగా ఎదురుచూసేవారని అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు నాయుడు, రాజశేఖర్ రెడ్డి లాంటి నాయకులు సభలో మాట్లాడుతుంటే ప్రజలు టీవీలకు అత్తుకుని పోయేవారని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత అసెంబ్లీలో కేసీఆర్ ఏం మాట్లాడతారని ఆసక్తి ఉండేదని చెప్పుకొచ్చారు. కానీ.. ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీలో మాత్రం బట్టలు విప్పుడు, కత్తులు దూసుడే కనిపిస్తోందంటూ మాజీ మంత్రి వ్యాఖ్యలు చేశారు. ఇప్పుడీ కామెంట్స్ సంచలనంగా మారాయి.

ఇక.. అసెంబ్లీ లాబీలో మల్లారెడ్డి, చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ మధ్య ఆసక్తికర సంభాషణ జరిగింది. ఈరోజు అసెంబ్లీ లాబీలో మల్లారెడ్డి, ఎమ్మెల్యే వివేక్ ఒకరికొకరు ఎదురుపడ్డారు. 'వివేక్‌ను.. నమస్తే మంత్రి గారు' అంటూ మల్లారెడ్డి పలకరించారు. ఇందుకు థాంక్స్ మల్లన్న అని పలకరించారు వివేక్ వెంకటస్వామి. రాష్ట్రంలో కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఫ్యామిలీ, వివేక్ వెంకటస్వామి ఫ్యామిలీదే హవా నడుస్తోందంటూ మల్లారెడ్డి కామెంట్స్ చేయగా.. బీఆర్ఎస్ హయంలో కేసీఆర్, మల్లారెడ్డిదే హవా నడిచిందని వివేక్ సమాధానం ఇచ్చారు. 'మేము అధికారం కోల్పోయాం మాదేం లేదన్న' అంటూ మల్లారెడ్డి అనడంతో ఇద్దరు నేతల మధ్య నవ్వులు పూశాయి.

# ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌పై విచారణ

**ముగిసిన బీఆర్ఎస్ తరపున వాదనలు**

**ఏప్రిల్ 2కు వాయిదా!**



బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

పార్టీ మారిన ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌పై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. జస్టిస్ బీఆర్ గవాయ్ ధర్మాసనం విచారణ చేపట్టింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి తరఫున సీనియర్ న్యాయవాది సుందరం వాదనలు వినిపించారు. ముగ్గురు ఎమ్మెల్యేలపై వేర్వేరుగా ఫిర్యాదు చేసినా స్పీకర్ స్పందించలేదన్నారు. నోటీసు కూడా ఇవ్వలేదని చెప్పారు. ఒక ఎమ్మెల్యే కాంగ్రెస్ తరపున లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసి ఓడారని, ఆ తర్వాత కూడా బీఆర్ఎస్‌లోనే ఉన్నామంటున్నారని చెప్పారు. మంగళవారం జరిగిన విచారణలో బీఆర్ఎస్ తరుపున వాదనలు ముగిశాయి. స్పీకర్, అసెంబ్లీ కార్యదర్శిల వాదనలను ఏప్రిల్ 2న వింటామని విచారణను సుప్రీం కోర్టు వాయిదా వేసింది.

పార్టీ ఫిరాయించిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్ విచారణను సుప్రీం కోర్టు ఏప్రిల్ 2కు వాయిదా వేసింది. మంగళవారం జరిగిన విచారణలో బీఆర్ఎస్ తరఫున వాదనలు ముగిశాయి. స్పీకర్, అసెంబ్లీ కార్యదర్శి వాదనలను ఏప్రిల్ 2న వింటామంటూ విచారణను సుప్రీం కోర్టు వాయిదా వేసింది. స్పీకర్ తరఫున సోమవారం సాయంత్రం సుప్రీంకోర్టులో అసెంబ్లీ సెక్రటరీ కౌంటర్ దాఖలు చేశారు. పది మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపునకు సంబంధించి తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ సకాలంలో నిర్ణయం తీసుకోలేదన్న వాదన సరైంది కాదని.. పిటిషనర్లు దురుద్దేశంతో వ్యవహరిస్తున్నారని అందులో పేర్కొన్నారు. స్పీకర్ ను ఆశ్రయించిన 20 రోజులకే బీఆర్ఎస్ వాళ్ళు కోర్టును ఆశ్రయించారని కౌంటర్ లో పేర్కొన్నారు. అనర్హత పిటిషన్లపై చట్టంలో పేర్కొన్న పద్ధతిని స్పీకర్ అనుసరిస్తున్నారని, స్పీకర్ ఉద్దేశ పూర్వకంగా ఆలస్యం చేశారనడానికి ఎలాంటి కారణాలు లేవని అసెంబ్లీ కార్యదర్శి తెలిపారు. ఈ విషయంలో దాఖలైన స్పెషల్ లీవ్ పిటిషన్లలో పస లేదని, వాటిని తిరస్కరించాలని.. పార్టీ ఫిరాయింపులపై వేసిన పిటిషన్లను కొట్టివేయాలని కౌంటర్ లో కోరారు.

మంగళవారం వాదనలు మొదలవ్వగానే.. అసెంబ్లీ కార్యదర్శి దాఖలు చేసిన కౌంటర్ అఫిడవిట్ సంగతిని స్పీకర్ తరపున వాదనలు వినిపిస్తున్న సీనియర్ లాయర్ ముకుల్ రోహత్గి ప్రస్తావించారు. ఈ వ్యవహారంలో స్పీకర్ ను ఆదేశించే అధికారం న్యాయస్థానానికి ఉంటుందా? లేదంటే రాజ్యాంగ ధర్మాసనానికి నివేదించాలా? అని కోరారు. బీఆర్ఎస్ తరపున వాదించిన అర్యమా సుందరం.. ఫిర్యాదులపై ఏం చేస్తారో.. 4 వారాల్లో షెడ్యూల్ చేయాలని తెలంగాణ హైకోర్టు ఆదేశించిందని.. అయినా పార్టీ మారిన వారికి స్పీకర్ నోటీసులు ఇవ్వలేదన్నారు. ధర్మాసనం కొన్ని వ్యాఖ్యలు చేసిన తర్వాతే నోటీసు ఇచ్చారని.. 3 వారాల్లో రిప్లై ఇవ్వాలని.. ఫిబ్రవరి 13న స్పీకర్ నోటీసులు ఇచ్చారని తెలిపారు. ఇప్పటికి 3 వారాలైందని, నోటీసులు ఎటు వెళ్లాయో తెలియదని కోర్టుకు నివేదించారు. తాము ఫిర్యాదు చేసి ఏడాదైనా స్పీకర్ షెడ్యూల్ కూడా చేయలేదని సుందరం వాదించారు. నాలుగు వారాల్లోగా నిర్ణయం తీసుకునేలా స్పీకర్ ను ఆదేశించాలని కోర్టును కోరారు. స్పీకర్ ఉద్దేశపూర్వకంగా ఆలస్యం చేస్తున్నారన్నారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలు లోక్ సభ ఎన్నికల్లో కాంగ్రెస్ కు ప్రచారం చేశారని తెలిపారు. స్పీకర్ ను ప్రశ్నించడం లేక అడ్డుకోవడం తమ ప్రయత్నం కాదని..ఫిరాయింపుల చట్టాన్ని అమలు చేయాలని మాత్రమే స్పీకర్ ను కోరుతున్నామని కోర్టుకు స్పష్టం చేశారు.

ఈ క్రమంలో స్పందించిన జస్టిస్ గవాయ్.. పార్టీ ఫిరాయింపులకు వార్షికోత్సవం అయిందా? అని వ్యాఖ్యానించారు. అయితే ఇలాంటి మిగితా 2వ పేజీలో

## అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో అల్పాహారం ఇవ్వాలి

- మాజీ మంత్రి ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి




బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

పదో తరగతిలో గ్రేడింగ్ విధానం తొలగిస్తున్నారు అని మాజీ మంత్రి ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు. అసెంబ్లీలో వారు మాట్లాడుతూ "అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో అల్పాహారం ఇవ్వాలి. ప్రభుత్వ పాఠశాలల్లో రాగి జావను కొనసాగించాలి. కొడంగల్‌లో మాత్రమే అల్పాహారం ఇస్తున్నారు. మిగతా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో అల్పాహారం ఇవ్వాలి. పదో తరగతిలో గ్రేడింగ్ విధానం తొలగిస్తున్నారు. బాసర ట్రిపుల్ ఐటీలో గ్రేడింగ్ విధానంతోనే ప్రవేశాలు. కస్తూర్బా పాఠశాలలను డిగ్రీ వరకు అప్‌గ్రేడ్ చేయాలి. 17 మోడల్ పాఠశాలల్లో ఖాళీలను వెంటనే భర్తీ చేయాలి. 25 వేల టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని గతంలో రేవంత్‌రెడ్డి చెప్పారు. కేవలం 11 వేల టీచర్ పోస్టులు మాత్రమే భర్తీ చేశారు. మిగతా టీచర్ పోస్టులు ఎందుకు భర్తీ చేయలేదు" అని అన్నారు.

## బీఆర్ఎస్ హయాంలో 26 వేల ఉపాధ్యాయ నియామకాలు

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు



బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

ఉపాధ్యాయ ఉద్యోగాల భర్తీపై కాంగ్రెస్ తప్పుడు ప్రచారాలకు అసెంబ్లీలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు కౌంటర్ ఇచ్చారు. తాము ఒక్క టీచర్ పోస్టు కూడా భర్తీ చేయలేదని నిరూపించగలవా అని శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్‌బాబుకు హరీశ్ రావు సవాల్ విసిరారు. బీఆర్ఎస్ హయాంలో ఒక్క టీచర్ పోస్టు భర్తీ జరగలేదని మంత్రి శ్రీధర్ బాబు సత్యదూరం మాటలు మాట్లాడారు. నేను ఛాలెంజ్ వేస్తున్నా.. బీఆర్ఎస్ హయాంలో 26 వేల ఉపాధ్యాయ నియామకాలు జరిగాయి.. 8 వేల ఉద్యోగాలు పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా, మరో 18 వేల ఉద్యోగాలు గురుకులాల్లో నియామకాలు చేసినం. 26 వేల టీచర్ పోస్టులను భర్తీ చేస్తే ఒక్కటి కూడా భర్తీ చేయలేదని శ్రీధర్ బాబు మాట్లాడడం సరికాదు. ఇక రెండో విషయానికి వస్తే.. ఎన్ని స్కూళ్లు మూతపడ్డాయని మా సబితక్క అడిగితే.. 79 స్కూల్స్ తెరిపించామని బాగానే చెప్పారు. కానీ కాంగ్రెస్ పాలనలో మూతబడ్డ 1913 స్కూళ్ల సంగతి ఎందుకు మాట్లాడరని అడుగుతున్నానని మంత్రి శ్రీధర్‌బాబును హరీశ్‌రావు ప్రశ్నించారు.

## ఎస్ఎల్‌బీసీ ప్రమాదంలో రెండో మృతదేహం లభ్యం

- మనోజ్ కుమార్‌గా గుర్తింపు
- ఉత్తరప్రదేశ్‌కు మృతదేహం తరలింపు

మిగితా 2వ పేజీలో

## అందాల పోటీ వల్ల ఉద్యోగాలు, ఆదాయం ఎలా వస్తుందో చెప్పాలి

- మాజీ మంత్రి కేటీఆర్



బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

'తెలంగాణ కష్టాల్లో ఉన్నప్పుడు.. రైతులు ఆత్మహత్యలు చేసుకుంటుంటే అందాల పోటీలా?' అని భారత రాష్ట్ర సమితి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ నిలదీశారు. అందాల పోటీల ఆవశ్యకత అవసరం లేదని కుండబద్దలు కొట్టారు. అందాల పోటీ వలన వచ్చే ఉద్యోగాలు, ఆదాయం ఎలా వస్తుందో చెప్పాలని డిమాండ్ చేశారు. 'దేశానికి గర్వకారణమైన అంబేడ్కర్ విగ్రహానికి తాళం వేసి బందీగా ఉంచింది. రూ.46 కోట్ల ఫార్ములా-ఈతో ఎలక్ట్రానిక్స్ పెట్టుబడులు తెస్తే తప్పా? రూ.55 కోట్లతో అందాల పోటీలు నిర్వహిస్తుంది' అని వివరించారు. తెలంగాణ అసెంబ్లీ సమావేశాల్లో మంగళవారం రాత్రి కేటీఆర్ కీలక ప్రసంగం చేశారు. రాష్ట్ర పర్యాటకం.. పెట్టుబడులు వంటి అంశంపై కేటీఆర్ ప్రసంగించారు. 'రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. తాగునీళ్లు లేవు.. సాగునీళ్లు లేవు' అని కేటీఆర్ తెలిపారు. రైతులు ఆత్మహత్య చేసుకున్న విషాదకరమైన పరిస్థితుల్లో అందాల పోటీలు నిర్వహించడంపై ధ్వజమెత్తారు. తాగు, సాగునీరు లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటే ప్రభుత్వం అందాల పోటీలకు ప్రాధాన్యత ఇవ్వడంపై కేటీఆర్ ప్రశ్నించారు. అందాల పోటీల వలన ఆదాయం కానీ ఉద్యోగాలు కానీ ఎట్లా వస్తాయో ప్రభుత్వం చెప్పాలని డిమాండ్ చేశారు. ఫార్ములా-ఈ రేసుని ఏకపక్షంగా మంత్రివర్గం ఆమోదం లేకుండా రద్దు చేయడంతో రాష్ట్రానికి రూ.46 కోట్ల నష్టం జరిగిందని గుర్తుచేశారు. 'ఫార్ములా-ఈ రేసుతో ఎలక్ట్రానిక్స్ రంగంలో భారీ పెట్టుబడులు వచ్చాయి. జహీరాబాద్‌తో పాటు రంగారెడ్డి, వెనకతల, మహబూబ్‌నగర్ వంటి చోట్ల ఎలక్ట్రానిక్స్ రంగంలో భారీగా పెట్టుబడులు వచ్చాయి' అని కేటీఆర్ వివరించారు.

పర్యాటక విధానంలో 99 ఏళ్లకు ప్రభుత్వ భూములు, ఆస్తులను లీజుకు ఇవ్వడం ఏ విధంగా న్యాయమని మాజీ మంత్రి కేటీఆర్ ప్రశ్నించారు. డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఎందుకు టూరిజం సర్కిల్‌లో పెట్టాలని లేదు. దానికి తాళాలు వేసి ఎందుకు ఉంచారో చెప్పాలి' అని కేటీఆర్ డిమాండ్ చేశారు. 'కేసీఆర్ ప్రభుత్వ హయాంలో పదేళ్ల పర్యాటకాన్ని బాగా అభివృద్ధి చేశాం. కానీ ఏం జరగలేదన్నట్టు జూపల్లి మాట్లాడుతున్నారు. రంగనాయక సాగర్, కొండపోచమ్మ వంటి అభివృద్ధి చేశాం' అని మాజీ మంత్రి కేటీఆర్ వివరించారు.

## బెట్టింగ్‌లో పైసలు పోయాయని యువకుడు ఆత్మహత్య

**మేడ్చల్ మండల పరిధిలోని గౌడవెల్లి రైల్వే ట్రాక్ పై ఘటన**



బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

క్రికెట్ బెట్టింగ్ యాప్ లో లక్ష రూపాయలు పోగొట్టుకుని తీవ్ర మనోవేదనకు గురై ఓ యువకుడు రైలు పట్టాల కింద పడి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన మంగళవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గౌడవెల్లి రైల్వే స్టేషన్ సమీపంలో జరిగింది. వివరాల్లోకి వెళ్తే ఏపీలోని అనకాపల్లి జిల్లాకు చెందిన రమణ, కనకమ్మలు వారి ఏకైక కుమారుడు సోమేష్ (29)తో కలసి సుమారు 25 ఏండ్ల క్రితం ఉపాధి నిమిత్తం మేడ్చల్ జిల్లాలోని గుండ్లపోచంపల్లికి వలస వచ్చారు. సోమేశ్ దేవరయాంజల్ ప్రాంతంలోనీ ఓ ప్రయివేటు పరిశ్రమలో అసిస్టెంట్ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఐదేండ్ల క్రితం తన సోదరి వివాహం కోసం తెచ్చిన కొంత డబ్బును బెట్టింగ్ పోగొట్టుకున్నాడు. ఈ విషయాన్ని తల్లిదండ్రుల దష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరించుకున్నాడు. తాజాగా సోమేశ్ సోమవారం జరిగిన ఐపీఎల్ మ్యాచ్ లో లక్ష రూపాయలు ఓ బెట్టింగ్ యాప్‌లో పోగొట్టుకున్నాడు. ఈ విషయాన్ని మంగళవారం ఉదయం ఫోన్‌లో తన బాల్య మిత్రుడికి చెబుతూ తీవ్ర మనస్థాపానికి గురయ్యాడు. స్నేహితుడు ఎంత నచ్చ చెప్పినా వినకుండా సోమేశ్ తాను ఆత్మహత్య చేసుకుంటానని, తాను బెట్టింగ్ పెట్టిన డబ్బులు తన కంపెనీకి సంబంధించినవని చెప్పుకొచ్చాడు. డబ్బులు సర్ది ఎలాంటి ఇబ్బంది లేకుండా చూద్దామని సోమేష్‌కు తన మిత్రుడు నచ్చజెప్పినా వినకుండా రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆత్మహత్యకు ఏడు నిమిషాల ముందు సోమేష్ తన మిత్రుడికి వాట్స్ ఆప్ ద్వారా లోకేషన్ పంపించాడు. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. ఈ బెట్టింగ్ యాప్ లపై రాష్ట్ర ప్రభుత్వం ఉక్కు పాదం మోపి కఠిన చర్యలు తీసుకోవాలని సోమేష్ తల్లిదండ్రులతోపాటు మిత్రులు డిమాండ్ చేస్తున్నారు. ఇలాంటి విషాదం మరే కుటుంబంలో వెలుగు చూడకుండా ప్రభుత్వ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## వేడి నీళ్ల బకెట్‌లో పడి బాలుడు మృతి



బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

వేడి నీళ్ల బకెట్‌లో పడి నాలుగేండ్ల బాలుడు మతి చెందిన సంఘటన మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా జవహర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు, మృతుని కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. కటి నర్సింహా, సుమలత దంపతులు వారి ఇద్దరు కుమారులతో కలిసి బాలాజీ నగర్‌లో నివాసముంటున్నారు. ఆదివారం ఉదయం నర్సింహా అత్త పుల్లమ్మ అతని చిన్న కుమారుడు బన్నీ (4)ని తీసుకొని తన ఇంటికి సమీపంలో ఉన్న సోదరుడు సాయి ఇంటికి తీసుకువెళ్ళింది. అక్కడ వాటర్ హీటర్‌తో బకెట్‌లో నీటిని వేడి చేస్తున్నారు. ఈ క్రమంలో ఆడుకుంటున్న బన్నీ అనుకోకుండా వేడి నీటిలో పడిపోయాడు. దాంతో బాలుడి ఛాతీ నుంచి కాళ్ళ వరకు కాలిపోయింది. వెంటనే సాయి సమీపంలోని మీనాక్షి ఆస్పత్రికి తీసుకెళ్లి ప్రథమ చికిత్స చేయించి ఏఎస్ రావు నగర్‌లోని అంకురా ఆస్పత్రిలో చేర్పించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం గాంధీ ఆస్పత్రికి తరలించారు. బన్నీ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మంగళవారం ఉదయం మృతి చెందాడు. బన్నీ తండ్రి నర్సింహా పిర్యాదు మేరకు జవహర్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని అన్ని కోణాలలో దర్యాప్తు చేస్తున్నారు.

# న్యాయవాదుల ఆందోళనలు

**బలగం టీవి, హైదరాబాద్**

న్యాయవాది ఇజ్రాయిల్ హత్యపై నిరసనలు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా న్యాయవాదుల ఆందోళనలు కొనసాగగా, హైదరాబాద్‌లో అసెంబ్లీ ముట్టడికి యత్నించారు. ఆందోళన చేస్తున్న న్యాయవాదులను గన్ పార్క్ వద్ద పోలీసులు అదుపులోకి తీసుకున్నారు దీంతో తీవ్ర ఉద్రిక్తత నెలకొది. న్యాయవాదులపై దాడులు పెరుగుతున్నాయని, తమ రక్షణ కోసం ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్ ను రాష్ట్రంలో వెంటనే అమలు చేయాలని కోరుతూ రాష్ట్రవ్యాప్తంగా ర్యాలీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. . నిరసన కారులను అక్కడి నుంచి పోలీస్ స్టేషన్కు తరలించారు. చంపాపేట్ పరిధిలోని న్యూ మారుతి నగర్‌కాలనీలో లాయర్ ఇజ్రాయెల్ పై ఓ వ్యక్తి కత్తితో దాడి చేశారు. దీంతో తీవ్రంగా గాయపడిన న్యాయవాది ఇజ్రాయెల్ ను అపోలో ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా చికిత్స పొందుతూ ఆయన మృతి చెందారు. ఈ హత్య అనంతరం ఐఎస్ సదన్ పోలీస్ స్టేషన్ లో నిందితుడు దస్తగిరి లొంగిపోయాడు. ఇక, మృతుడు నివాసం ఉంటున్న పై ఫ్లాట్ లో ఎలక్ట్రీషియన్ దస్తగిరి మహిళను వేధింపులకు గురి చేస్తుండగా ఆ వేదింపులు భరించలేక ఆ మహిళ న్యాయవాది ఇజ్రాయెల్ ను ఆశ్రయించింది. మహిళతో కలిసి సంతోష్ నగర్ పోలీస్ స్టేషన్ లో ఎలక్ట్రీషియన్ దస్తగిరిపై న్యాయవాది ఇజ్రాయెల్ ఫిర్యాదు చేశారు. తనపై ఫిర్యాదు చేస్తావా అంటూ కక్ష కట్టిన నిందితుడు కత్తితో దాడి చేసి చంపేశాడు. కాగా, ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని నిందితుడు అరెస్ట్ చేయగా.. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం గాంధీ ఆస్పత్రికి తరలించారు.

# కల్లుగీత పారిశ్రామిక కార్పొరేషన్ కు నీరా కేఫ్

**బలగం టీవి, హైదరాబాద్**

తెలంగాణ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. ట్యాంక్‌బండ్ వద్ద ఉన్న నీరా కేఫ్ ను కల్లుగీత పారిశ్రామిక కార్పొరేషన్ కు అప్పగించింది. ఎక్సైజ్, పర్యాటక శాఖలతో సంప్రదించిన ప్రభుత్వం.. నీరా కేఫ్‌ను పర్యాటక శాఖ నుండి తెలంగాణ రాష్ట్ర కల్లు గీత పారిశ్రామిక సంస్థకు బదిలీ చేసింది. అయితే, ఆ భూమి టూరిజం శాఖది కావడంతో నీరాకేఫ్ నుంచి వచ్చే ఆదాయంలో 30శాతం టూరిజంశాఖకు చెల్లించాలని పేర్కొంది. ఈ మేరకు మంగళవారం ప్రభుత్వం జీవో జారీ చేసింది.

# ఘట్‌కేసర్ ఫ్లైఓవర్ పనులు ప్రారంభించాలి

## డిప్యూటీ సీఎం భట్టికి మల్లారెడ్డి వినతి

**బలగం టీవి, హైదరాబాద్**

హైదరాబాద్ నగర శివారులో ఉన్న ఘట్‌కేసర్ ఫ్లైఓవర్ వంతెన పనులు ప్రారంభించాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే మల్లారెడ్డి కోరారు. మంగళవారం అసెంబ్లీ లాబీలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కలిసి వినతి పత్రం ఇచ్చారు. సుమారు 14 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఘట్‌కేసర్ ఫ్లైఓవర్ పనులు పెండింగ్ లో ఉన్నాయని మల్లారెడ్డి చెప్పారు. వంతెన పనులు ప్రారంభించేందుకు రూ.50 లక్షల నిధులు మంజూరు చేసినట్లు భట్టి విక్రమార్క తెలిపారు. పనులు వేగవంతమయ్యే విధంగా చర్యలు తీసుకుంటానని చెప్పారు.

# ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌పై విచారణ


(మొదటి పేజీ తరువాయి)

వ్యవహారాల్లో గతంలో రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన తీర్పులు ఉన్నప్పటికీ.. ఎప్పటిలోగా తేల్చాలనే విషయంపైనే స్పష్టత కొరవడిం దని వ్యాఖ్యానించారు. అలాంటప్పుడు ఆ తీర్పును కాదని ఎలా ముందుకు వెళ్లగలమని చెప్పింది. ఉన్నత ధర్మా సనాల తీర్పులను ఎలా తిరిగి రాయగలమని ప్రశ్నించింది. ఎమ్మెల్యేలకు నోటీసులు ఇవ్వడానికి ఇంకా ఎంత కాలం పడుతుందని ధర్మాసనం ప్రశ్నించింది. ఆలస్యం చేసే ఎత్తుగడలు అనుసరించొద్దని సూచించింది. ఎమ్మెల్యేల ఫిరాయింపులపై ఫిర్యాదు వచ్చి ఎంతకాలమైంది? రీజనబుల్ టైం అంటే పదవి కాలం గడువు ముగిసేవరకా? మొదటి ఫిర్యాదు చేసినప్పటి నుంచి ఇప్పటిదాకా ఎంత టైం గడిచింది? అని ప్రశ్నలు గుప్పించింది. నాలుగు వారాలైనా షెడ్యూల్ ఫిక్స్ చేయలేదా? .. అదృష్టవశాత్తూ.. ఎమ్మెల్యేలు 4 ఏళ్లు ఆగలేదని, మూడు వారాల సమయం విషయంలో మాత్రం స్పీకర్ రీజనబుల్ గా ఉన్నారని వ్యాఖ్యానించింది. తెలంగాణ హైకోర్టు సింగిల్ బెంచ్ జడ్జి ఇచ్చిన తీర్పులో డివిజన్ బెంచ్ జోక్యం సరైందో కాదో చూస్తామన్నారు.

కాగా ఎమ్మెల్యేల తరుపున వాదనలు వినిపించేందుకు వారం రోజులు గడువు కావాలని న్యాయవాది ముకుల్ రోహత్గీ అభ్యర్థించారు. కౌంటర్ దాఖలుకు సమయం కోరడంపై ప్రతివాదులపై న్యాయమూర్తి గవాయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వచ్చే బుధవారం వాదనలు వింటామని స్పష్టం చేస్తూ విచారణ వాయిదా వేశారు. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ లో చేరిన దానం నాగేందర్, తెల్లం వెంకట్రావు, కడియం శ్రీహరి, పోచారం శ్రీనివాస్ రెడ్డి, కాలె యాదయ్య, సంజయ్, కృష్ణమోహన్, మహిపాల్‌రెడ్డి, ప్రకాష్‌గౌడ్, అరికె పూడి గాంధీలపై అనర్హత వేటుపై స్పీకర్ ను ఆదేశించాలంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి దాఖలు చేసిన రెండు వేర్వేరు పిటిషన్లను కలిపి సుప్రీంకోర్టు విచారించింది. మరోవైపు బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి పార్టీ మారిన ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ప్రస్తుత పిటిషన్లపై వాదనలు ముగిశాక తమ పిటిషన్ విచారించాలని కోరారు. అయితే తాము ఈ వ్యవహారంలో మెరిట్స్ లోకి వెళ్లడం లేదని..ఎమ్మెల్యేలు పార్టీ మారిన వ్యవహారంలో స్పీకర్ కు ఆదేశాలు జారీ చేయవచ్చా లేదా అన్న అంశంపై మాత్రమే పరిశీలన చేస్తున్నామని జస్టిస్ గవాయ్ స్పష్టం చేశారు. ఎవరు ఎక్కడి నుంచి పోటీ చేశారు..ఎటు వెళ్లారు వంటి అంశాలను చూడటం లేదని పేర్కొన్నారు.

# విద్యాశాఖలో సంస్కరణలు తెస్తాం

## మంత్రి డి.శ్రీధర్‌బాబు



**బలగం టీవి, హైదరాబాద్**

విద్యాశాఖలో సంస్కరణలు తెస్తామని రాష్ట్ర శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు చెప్పారు. ఇందుకోసం శాసనమండలిలో విస్తృతంగా చర్చిస్తామని అన్నారు. విద్య, ఆరోగ్య రంగాలపై రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టిపెట్టిందని గుర్తు చేశారు. గతంలో విద్యాహక్కు చట్టాన్ని తెచ్చిందే తమ ప్రభుత్వమని వివరించారు. వచ్చే కొన్ని సంవత్సరాల్లో పాతబస్తీ రూపురేఖలు మారిపోతాయని చెప్పారు. గత పదేండ్లుగా ఓల్డ్‌సిటీ నిర్లక్ష్యానికి గురైందనీ, నిజానికి అది ఓల్డ్‌సిటీ కాదు.. ఒరిజినల్ సిటీ అని అభిప్రాయపడ్డారు. తాము ఇచ్చిన హామీలను తప్పకుండా అమలుచేస్తామని ప్రకటించారు. మంగళవారం అసెంబ్లీలో విద్యాశాఖపై చర్చలో పలువురు సభ్యులు పాల్గొన్నారు. ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో హాజరు శాతం తగ్గుతున్నదన్నారు. దీనికి టీచర్లే కారణమని వ్యాఖ్యానించారు. వారి పనితీరు బాగాలేదని చెప్పారు. ఓల్డ్‌సిటీలో సెలవులు ఉన్నప్పుడు పిల్లలు చిన్న చిన్న షాపుల్లో పనిచేస్తున్నారంటూ ప్రభుత్వం దృష్టికి తెచ్చారు. దీనిపై ఆయా షాపులపై కార్మిక శాఖ దాడులు చేసి కేసులు పెట్టాలని చెప్పారు. పిల్లలను పాఠశాలలకు తప్పకుండా వెళ్లేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉర్దూ భాషను కాపాడాలనీ, సంబంధిత రంగాల్లో పోస్టులను భర్తీ చేయాలని కోరారు. పాఠశాలల్లో ఫర్నీచర్ కొన్నారనీ, బెంచీల కొనుగోళ్లల్లో పెద్ద స్కామ్ జరిగిందని ఆరోపించారు. ఒక్కో బెంచీకి రూ. 3000 నుంచి రూ. 4000 అవుతుందన్నారు. కానీ రూ. 18 వేలకు ఖరీదు చేయడాన్ని తప్పుబట్టారు. దీనిపై విచారణ చేయాలని కోరారు. పాఠశాలలతోపాటు ఇంటర్మీడియట్‌లోనూ పిల్లలు డ్రాపౌట్ అవుతున్నారని చెప్పారు. 40 శాతం మాత్రమే హాజరు శాతం ఉంటున్నదని గుర్తు చేశారు. గ్రాడ్యుయేషన్‌లో చేరకపోవడంపై అధ్యయనం చేయించాలని కోరారు. హైదరాబాద్‌లో పబ్‌ల సంస్కృతిని నియంత్రించాల్సిన అవసరం ఉందన్నారు. కొత్త నిబంధనలు రూపొందించి అమలు చేయాలని కోరారు. పబ్‌ల్లో డ్రగ్స్ సైతం సరఫరా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పాతబస్తీ నుంచి అన్నీ వెళ్లిపోతున్నాయని అన్నారు. త్వరలో హైకోర్టు సైతం షిఫ్ట్ చేయనున్నారని అన్నారు. ఆ భవనాన్ని నిజాం నగలు ప్రదర్శించడానికి వినియోగించాలని సూచించారు. 'జూ'ను తరలిస్తామని ప్రభుత్వం చెబుతున్నదన్నారు. లండన్ జూ తో పోలిస్తే మనది ఎందుకు పనికి రాదని చెప్పారు. పాతబస్తీపై వివక్ష చూపరాదన్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు యేన్నం శ్రీనివాసరెడ్డి, కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ బట్టకాల్చి మీదేయడం బీఆర్ఎస్ సభ్యులకు అలవాటైందని విమర్శించారు. ఇంజినీరింగ్ విద్యాసంస్థల ఏర్పాటులో గతంలో ఘోరమైన తప్పిదాలు దొర్లాయని వ్యాఖ్యానించారు. పట్టణాల్లోనే తప్ప గ్రామీణ ప్రాంతాల్లో ఇంజినీరింగ్ కాలేజీలు ఏర్పాటు చేయలేదన్నారు. దీంతో పేద విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమయ్యారని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకున్న పిల్లల పరిస్థితి దారుణంగా ఉందన్నారు. అన్నీ సౌకర్యాలతో స్కూళ్లను అప్‌గ్రేడ్ చేయాలని సూచించారు. గత బీఆర్ఎస్ సర్కారు 12 స్కూళ్లను మూసివేసిందన్నారు. మాజీ ప్రధాని పీవీ నర్సింహరావు పాఠశాలలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టారని అన్నారు. ఆయన పెట్టిన పాఠశాల నుంచి టాపర్స్

# ఎస్ఎల్బీసీ ప్రమాదంలో రెండో మృతదేహం వెలికితీత

**బలగం టీవి, హైదరాబాద్**

అచ్చంపేట, ముధు నాగర్ కర్నూలు జిల్లా అచ్చంపేట నియోజకవర్గం అమ్రా బాద్ మండలం దోమల పెంట గ్రామం లోని ఎస్ ఎల్ బీసీ టన్నెల్ ప్రమాదంలో చిక్కుకున్న ఎనిమిది మందిలో రెండవ మృతదేహాన్ని రెస్క్యూ టీమ్ ద్వారా వెలిగి తీశారు. మృతదేహం ఉత్తర ప్రదేశ్ రాష్ట్రం

బఉన్నావు జిల్లా బంగార్మో గ్రామానికి చెందిన మనోజ్ కుమార్ గా పోస్టుమార్గం ద్వారా గుర్తించిన అధికారులు మృతుడి స్వగా మంలో తండ్రి అర్జున్ ప్రసాద్, మృతుడి భార్యస్వర్ణలత కుమారుడు ఆదర్స్ కుమార్తె శైలు తల్లి అమునాదేవిలు ఉన్నట్లు జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ వివరాలు వెల్లడించారు. ఈ నెల 9వ తేదీ రాత్రి పంజాబ్ రాష్ట్రానికి చెందిన గురుప్రీత్ సింగ్ మృతదేహం లభించింది.మంగళవా రం జయప్రకాష్ అసోసియేట్స్ లిమిటెడ్ కంపెనీలో ఇంజనీర్ గా విధులు నిర్వహిం చివ మనోజ్ కుమార్ కు రాష్ట్ర ప్రభుత్వం తరపునరూ.25 లక్షల ఎక్స్ గ్లేషియా వారి కుటుంబ సభ్యులకు అందించనున్నట్లు కలె క్టర్ పేర్కొన్నారు



**బలగం టీవి, హైదరాబాద్**

వర్షాకాలం ఎదురయ్యే సమస్యల పరిష్కారంపై హైడ్రా, జీహెచ్ఎంసీ ప్రత్యేక దష్టి పెట్టాయి. విపత్తుల సమయంలో సంభవించే సంఘటనలతోపాటు అగ్ని ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై ఇరు విభాగాలు సమీక్షించాయి. వరద ముప్పుతో పాటు, అగ్ని ప్రమాదాలకు ఆస్కారం లేకుండా తీసుకోవాల్సిన చర్యలపై హైడ్రా ఏవీ రంగనాథ్, జీహెచ్ఎంసీ కమిషనర్ కె. ఇలంబర్తి మంగళవారం జీహెచ్ ఎంసీ కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు. అగ్ని ప్రమాదాల నివారణకు ఫైర్ డిపార్టుమెంట్‌తో పాటు.. హైడ్రా, జీహెచ్ఎంసీ విభాగాలతో కలసి ఒక కమిటీని ఏర్పాటు చేయాలని ఇరువురు కమిషనర్లు నిర్ణయించారు. వర్షాకాలంలో వరద ముప్పు నివారణతో పాటు, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చూడడానికి ట్రాఫిక్, హైడ్రా, జీహెచ్ఎంసీ అధికారులతో కమిటీలు ప్రాంతాలవారీ వేయాలని నిర్ణయించారు. ఈ రెండు కమిటీలు ఎప్పటికప్పుడు సమావేశమై, సమన్వయంతో సమస్యలు ఉత్పన్నం కాకుండా చూడాలని సూచించారు. అగ్ని ప్రమాదాలు ఏ ప్రాంతంలో ఎక్కువ జరుగుతున్నాయి, ఎందుకు జరుగుతున్నాయనే విషయాన్ని మనం తెలుసుకోవడమే కాకుండా, ఆయా ప్రాంతాల్లో కూడా అవగాహన కల్పించాల్సినవసరం ఉందని భావించారు. ప్రమాదాలు ఎక్కువ జరుగుతున్న ప్రాంతం నుంచే తనిఖీలు ప్రారంభించి, వారిని అప్రమత్తం చేయాలని ఓ నిర్ణయానికొచ్చారు. నిబంధనలు ఏం చెబుతున్నాయి.. వాటిని నివాసితులు, వాణిజ్యసముదాయాల యజమానులు పాటిస్తున్నారా.. అనేది తరచూ తనఖీలు చేయాల్సినవసరాన్ని గుర్తుచేశారు. నగరంలో వరద ముప్పు ఉన్న 141 ప్రాంతాలను ఇప్పటికే గుర్తించిన అధికారులు, అక్కడ పరిస్థితి ఎలా ఉంది, వరద నివారణకు తీసుకున్న చర్యలపై ఇరువురు కమిషనర్లు సమీక్షించారు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని నాలాల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించడం, కల్వర్టులు, నాలాలు, క్యాచ్‌మెంట్ ప్రాంతాల్లో వరద నీరు సాఫీగా సాగేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు. క్యాచ్‌మెంట్ ప్రాంతాలను గుర్తించి, వరద నీరు దగ్గర్లో చెరువుకు చేరేలా చూడాలని సూచించారు. జోనల్ స్థాయి కమిటీలు అక్కడి సమస్యకు సమాధానం చెప్పేలా ఉండాలని భావించారు. సమస్యపై పూర్తి అవగాహన ఉంటే.. పరిష్కారానికి చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందన్నారు. ఎక్కడికక్కడ జవాబూదారి వ్యవస్థను రూపొందించినప్పుడే వరద ముప్పుతో పాటు అగ్ని ప్రమాదాలను నివారించగలమని వారు నిర్ణయానికొచ్చారు.

# ఆగని చేనేత ఆత్మహత్యలు

**-వివిధ కారణాలతో ఇరువురి ఆత్మహత్య**

**బలగం టీవీ , తంగళ్ళపల్లి**

రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్ళపల్లి మండలంలోని నేత కార్మికుడు ఆత్మహత్య చేసుకున్నాడు. బాత్రూంలో కడిగే యాసిడ్ తాగి, బలవన్మరణానికి పాల్పడ్డాడు. మండలంలోని ఇందిరమ్మ కాలనీ టెక్స్ టైల్ పార్క్ కి చెందిన పరికిపెల్లి రాజుకు(53) భార్య పద్మ, కొడుకు రాకేష్, ఇద్దరు కూతుర్లు ఉన్నారు. రాజు మరమగ్గాలు నడుపుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఇద్దరు కూతుర్లు, కొడుకు వివాహం కూడా జరిపించారు. కాగా, రాజుకు గత కొన్ని రోజులుగా సరైన పని లేక పోవడం వలన ఖాళీగా ఉంటున్నాడు. దీనికి తోడు అప్పుల బాధ ఈ క్రమంలో తరచూ మద్యం సేవిస్తూ తీవ్ర మస్తాపానికి గురైన రాజు ఎవరు లేని సమయంలో యాసిడ్ తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్న రాజు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.మండలంలోని చర్లవంచ గ్రామానికి చెందిన మొగిళోజీ విష్ణు అనారోగ్య కారణంతో తన నివాసంలోని బాత్రూంలో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.ఘటనల పై పోలీసులు విచారణ చేస్తున్నారు.

# అంజన్న ఆలయ నూతన ఈవోగా నాగారపు శ్రీనివాస్ యాదవ్..

**బలగం టీవీ, సిరిసిల్ల**



వేములవాడ అర్బన్ మండలంలోని శ్రీ హనుమాన్ దేవాలయం అగ్రహారం ఆలయ నూతన కార్యనిర్వహణ అధికారిగా నాగారపు శ్రీనివాస్ యాదవ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు నూతన ఆలయ ఈవో ను స్వామివారి మండపంలో ఘనంగా సత్కరించి లడ్డు ప్రసాదం అందజేశారు. అనంతరం ఆలయ మాజీ ఈవో మారుతి, ఆలయ సిబ్బంది అర్చకులు ఆయనకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు.

# డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను అర్హులైన నిరుపేదలకు కేటాయించాలి..

**-సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ముశం రమేష్**

**బలగం టీవీ , సిరిసిల్ల**




మండపల్లి కేసీఆర్ నగర్లో నిర్మించిన డబల్ బెడ్ రూమ్ ఇండ్లను అర్హులైన నిరుపేదలకు కేటాయించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ముశం రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం సిరిసిల్ల పట్టణంలోని అమృత లాల్ శుక్ల కార్మిక భవనంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి ముశం రమేష్ మాట్లాడుతూ సిరిసిల్ల పట్టణంలో శాంతినగర్లో నిర్మించినటువంటి 204 డబల్ బెడ్ రూమ్ ఇండ్లు నిర్మాణం పూర్తయి రెండు సంవత్సరాలు అవుతున్న కూడా ఇప్పటికీ పంపిణీ చేయకుండా అలాగే ఉంచడం వలన కట్టిన డబుల్ బెడ్ రూమ్ పాడైపోతున్నాయని అన్నారు. దళితులకు ఇస్తామని నిర్మించిన డబల్ బెడ్ రూమ్ అర్హులైన దళితులందరికీ వెంటనే అందించాలని వారికి ఇవ్వకుండా ఇతరులకు ఇవ్వకుండా ప్రభుత్వం కాలయాపన చేయడం సరైనది కాదని అన్నారు.సమస్యను వెంటనే పరిష్కరించి అర్హులైన దళితులకు అందించి ఏమైనా మిగిలితే ఇతర అర్హులైన నిరుపేదలకు అందించాలని అన్నారు. మండేపల్లి కేసీఆర్ నగర్ డబల్ బెడ్ రూమ్ ఇండ్లు ఖాళీగా ఉంటే,వాటిలో నివసిస్తారని, గతంలో కలెక్టర్ ఆకస్మృతిగా ఎంక్వయిరీ నిర్వహించడం జరిగిందని అన్నారు. ఎంక్వయిరీ నిర్వహించి ఇప్పటికి రెండు మాసాలు అవుతున్నాదని,ఎంక్వయిరీలో గుర్తించిన ఖాళీ డబల్ బెడ్ రూమ్ లను వెంటనే అర్హులకు కేటాయించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సిపిఎం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహిస్తామని అన్నారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కోడం రమణ, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు సు రం పద్మ పాల్గొన్నారు.




# బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపికి ఘన సన్మానం

**బలగం టీవీ, ఎల్లారెడ్డి పేట**

రాజన్న సిరిసిల్ల జిల్లా బిజెపి పార్టీ జిల్లా అధ్యక్షునిగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన రెడ్డ బోయిన గోపీని ఎల్లారెడ్డి పేట మండల ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఎల్లారెడ్డిపేట లో మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షులు పెరుమాండ్ల అంజయ్య ఆధ్వర్యంలో ఈ జరిగినకార్యక్రమంలో మండల ముదిరాజ్ సంగం ఉపాధ్యక్షులు పరుస సత్తయ్య , కోశాధికారి బాల నర్సు ,సలహాదారుడు దేవయ్య, నారాయణ, సత్తయ్య ,నాంపల్లి, లింగం, ఎల్లం, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

# వార్షిక పరీక్షలకు సిద్ధం కావాలి..

**-కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ**

**బలగం టీవీ, వేములవాడ**



విద్యార్థులు వార్షిక పరీక్షలకు సిద్ధం కావాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ పిలుపునిచ్చారు. మంగళవారం వేములవాడ రూరల్ మండలం హన్మాజిపేటలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ ఆకస్మిక తనిఖీ చేశారు. సిబ్బంది, ఆరోగ్య కేంద్రానికి వచ్చే పేషెంట్ల వివరాలు ఆరా తీశారు. అటెండెన్స్ రిజిస్టర్, ఆరోగ్య కేంద్రంలోని అన్ని విభాగాలను పరిశీలించారు. ఆరోగ్య కేంద్రానికి వచ్చే పేషెంట్లకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. అనంతరం ప్రాథమిక పశువైద్య కేంద్రాన్ని తనిఖీ చేసి, అందుబాటులో ఉన్న వ్యాక్సిన్ల వివరాల ఆరా కృత్రిమ గర్భధారణ నెలకు ఎన్ని అవుతున్నాయి అనే అడిగి తెలుసుకున్నారు. ఏమైనా ఇబ్బందులు ఉంటే జిల్లా యంత్రాంగానికి తెలియజేయాలని సూచించారు.

**మధ్యాహ్న భోజనం తయారీ విధానం పరిశీలన**

హన్మాజిపేటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను కలెక్టర్ తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం తయారీ విధానం, స్టోర్ రూం, తరగతి గదులను పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలెక్టర్ మాట్లాడుతూ పరీక్షలకు సన్నద్ధం కావాలని విద్యార్థులకు సూచించారు. వచ్చే సంవత్సరం అడ్మిషన్లు పెంచాలని ఆదేశించారు. అక్కడి నుంచి నేరుగా లింగంపల్లి గ్రామంలో అంగన్వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఎంత మంది పిల్లలు వస్తున్నారు.కేంద్రం పరిధిలో ఎంత మంది గర్భిణులు, బాలింతలు ఉన్నారో ఆరా తీశారు. పిల్లల బరువు, ఎత్తు వివరాలకు సంబంధించిన రిజిస్టర్ ను పరిశీలించి నాణ్యమైన పోష్టికాహారం అందజేయాలని సూచించారు. ఈ తనిఖీలో వైద్యులు, సిబ్బంది, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# కలెక్టర్‌ను కలిసిన ఎల్లారెడ్డి పేట జర్నలిస్టులు...

**బలగం టీవీ,ఎల్లారెడ్డిపేట**



ఎల్లారెడ్డి పేట ప్రెస్ క్లబ్ కు చెందిన పలువురు జర్నలిస్టులు కలెక్టర్ సందీప్ కుమార్ ఝు ను కలిశారు. జనం కోసం జర్నలిస్టు అనే నినాదం తో ఎల్లారెడ్డి పేట ప్రెస్ క్లబ్ సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టిన కార్యక్రమాలలో భాగంగా ఎల్లారెడ్డి పేటలో వేసవి కాలం లో ప్రజల దాహార్తి తీర్చుటకు త్వరలో ఏర్పాటు చేయనున్న చలి వేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ కు వివరించి వారిని అట్టి కార్యక్రమంలో పాల్గొని జర్నలిస్టులకు ప్రోత్సాహాన్ని అందించాలని కోరారు. ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ మండలంలో అక్రమ ఇసుక రవాణా జరుగుతుందా అని ప్రశ్నించారు. చలివేంద్రం ద్వారా ఎలాంటి నీటిని ప్రజలకు అందిస్తారని అడిగారు. చల్లని త్రాగునీటి నీ రంజన్ల ద్వారా ప్రజలకు అందించనున్నట్లు,వేసవి కాలం పూర్తి అయ్యే వరకు ప్రజల దాహార్తి తీర్చనున్నట్లు జర్నలిస్టులు కలెక్టర్ కు వివరించారు. కలెక్టర్ తనవంతుగా ఎలాంటి సహాయం అయినా జర్నలిస్టులకు అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ గౌరవ అధ్యక్షులు శ్రీనివాస రాజు,అధ్యక్షులు గౌరీ శంకర్,ప్రధాన కార్యదర్శి శ్యమంతుల అనిల్,,కార్యదర్శి శ్రీ రామోజీ శేఖర్,సంయుక్త కార్యదర్శులు శ్రీ రామోజీ ప్రవీణ్, కూలే రి కిషోర్ కుమార్,ఉపాధ్యక్షులు కందుకూరి రవి, జర్నలిస్టులు,మజీద్,విజయ్ బాబు, రవికాంత్ సురేష్,జగదీష్,మొహిజ్,చంద్ర మోహన్ రెడ్డి లు ఉన్నారు.

# ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సందర్శన

**బలగం టీవీ , తంగళ్ళపల్లి**



రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్ళపల్లి మండల కేంద్రం లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్ రజిత సందర్శించారు.పి హెచ్ సి లోని ఓ పి, ఇతర రిజిస్టర్లను తనిఖీ నిర్వహించి అన్ని ప్రోగ్రాముల పై రివ్యూ నిర్వహించారు.అనంతరం ఆరోగ్య మహిళ క్లినిక్,ల్యాబ్,ఫార్మసీ సందర్శించారు.గర్భిణీలకు కల్పిస్తున్నటువంటి మౌలిక సదుపాయాలు వసతులు, అవగాహన కల్పించాలని అన్నారు.తంగళ్లపల్లి వైద్యాధికారి డా" ఆఫీజా ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రముఖ దర్శకుడు భారతీరాజా తనయుడు కన్నుమూత

**బలగం టీవీ , హైదరాబాద్**

ప్రముఖ తమిళ దర్శకుడు భారతీరాజా తనయుడు, నటుడు, దర్శకుడు మనోజ్ భారతీరాజా గుండెపోటుతో మంగళవారం సాయంత్రం చెన్నైలో మరణించారు. ఆయన వయస్సు 48 సంవత్సరాలు. కొన్ని నెలల క్రితం మనోజ్ భారతీరాజాకి గుండెకు సంబంధించిన శస్త్రచికిత్స జరిగిందని, ఆయన కోలుకుంటున్నారని సినీ పరిశ్రమ వర్గాలు తెలిపాయి. మనోజ్ భారతికి భార్య నందన, కుమార్తెలు అర్షిత, మదివధని ఉన్నారు. మనోజ్ 1999లో తండ్రి భారతీరాజా దర్శకత్వంలో వచ్చిన రొమాంటిక్ డ్రామా 'తాజ్ మహల్' ద్వారా నటుడిగా పరిచయం అయ్యారు. ఈ చిత్రంలో రియా సేన్ కథానాయికగా నటించగా, మణిరత్నం రచనా సహకారం అందించారు. ఎ.ఆర్.రెహమాన్ సంగీతం అందించగా, బి.కణ్ణన్, మధు అంబత్ సినిమాటోగ్రఫీ బాధ్యతలు నిర్వర్తించారు.

'తాజ్ మహల్' తర్వాత మనోజ్ భారతీరాజా అనేక చిత్రాల్లో నటించారు. ఆయన నటించిన చిత్రాల్లో 'కడల్ పూకల్', 'అల్లి అర్జున', 'విరుమాన్', 'మానాడు' ముఖ్యమైనవి.2023లో మనోజ్ భారతీరాజా దర్శకుడిగా మారి 'మార్గళి తింగాల్' చిత్రాన్ని రూపొందించారు. దాదాపు 20 సంవత్సరాలు నటుడిగా కొనసాగిన తర్వాత ఆయన దర్శకత్వం వైపు అడుగులు వేశారు. ఈ చిత్రంలో ఆయన తండ్రి భారతీరాజాతో పాటు శ్యామ్ సెల్వన్, రక్షణా నటించారు. ఇళయరాజా సంగీతం అందించారు. మనోజ్ భారతీరాజా మృతితో కోలీవుడ్ విషాదంలో మునిగిపోయింది. రాజకీయ నాయకులు, నటీనటులు, సినీ పరిశ్రమ ప్రముఖులు సంతాపం తెలిపారు. తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ సంతాప సందేశం వెలువరించారు. "దర్శకుడు భారతీరాజా కుమారుడు, నటుడు, దర్శకుడు మనోజ్ భారతీరాజా మరణ వార్త విని నేను తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యాను. తన తండ్రి చిత్రం తాజ్ మహల్ ద్వారా పరిచయమైన మనోజ్ భారతీరాజా, 'సముద్రం', 'అల్లి అర్జున' వంటి అనేక చిత్రాలలో నటించి తనకంటూ ఒక గుర్తింపు తెచ్చుకున్నాడన్నారు.

# పంజాబ్ బోణీ



- **11 పరుగుల తేడాతో గుజరాత్ టైటాన్స్‌పై విజయం**

**బలగం టీవీ, హైదరాబాద్**

ఐపీఎల్ 2025 సీజన్‌లో పంజాబ్ కింగ్స్ బోణి కొట్టింది. గుజరాత్ టైటాన్స్‌తో అహ్మదాబాద్ వేదికగా మంగళవారం జరిగిన మ్యాచ్‌లో సమష్టిగా రాణించిన పంజాబ్ కింగ్స్ 11 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఇంపాక్ట్ ప్లేయర్ విజయ్‌కుమార్ వైశాఖ్, అర్ష్‌దీప్ సింగ్ అద్భుత బౌలింగ్‌తో పంజాబ్ కింగ్స్ విజయంలో కీలక పాత్ర పోషించారు.

ముందుగా బ్యాటింగ్ చేసిన పంజాబ్ కింగ్స్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లకు 243 పరుగుల భారీ స్కోర్ చేసింది. శ్రేయస్ అయ్యర్(42 బంతుల్లో 5 ఫోర్లు, 9 సిక్స్‌లతో 97 నాటౌట్) విధ్వంసకర బ్యాటింగ్‌తో చెలరేగగా.. ఓపెనర్ ప్రియాన్ష్ ఆర్య(23 బంతుల్లో 7 ఫోర్లు, 2 సిక్స్‌లతో 47), శశాంక్ సింగ్(16 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్స్‌లతో 44 నాటౌట్) మెరుపులు మెరిపించారు. గుజరాత్ టైటాన్స్ బౌలర్లలో సాయి కిషోర్(3/30) మూడు వికెట్లు తీయగా.. కగిసో రబడా, రషీద్ ఖాన్ చెరో వికెట్ తీసారు.

అనంతరం లక్ష్యచేధనకు దిగిన గుజరాత్ టైటాన్స్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లకు 232 పరుగులు చేసి ఓటమిపాలైంది. సాయి సుదర్శన్(41 బంతుల్లో 5 ఫోర్లు, 6 సిక్స్‌లతో 74), జోస్ బట్లర్(33 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్స్‌లతో 54) హాఫ్ సెంచరీలతో రాణించగా.. షెర్ఫెన్ రూథర్‌ఫోర్డ్(28 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్స్‌లతో 46) కీలక ఇన్నింగ్స్ ఆడారు. పంజాబ్ బౌలర్లలో అర్ష్‌దీప్ సింగ్ రెండు వికెట్లు తీయగా.. మార్కో జాన్సెన్, గ్లేన్ మ్యాక్స్‌వెల్ తలో వికెట్ తీసారు.

పంజాబ్ కింగ్స్ ఇంపాక్ట్ ప్లేయర్‌గా బరిలోకి దిగిన విజయ్ కుమార్ వైశాఖ్ మిడిల్ ఓవర్లలో కట్టడిగా బౌలింగ్ చేశాడు. వైడ్ యార్కర్లతో తెలివిగా బౌలింగ్ చేసిన అతను తన తొలి రెండు ఓవర్లలో ఐదేసి పరుగులు మాత్రమే ఇచ్చాడు. అతని కట్టడైన బౌలింగ్ పంజాబ్ కింగ్స్ విజయవకాశాలను మెరుగుపరిచింది. మూడో ఓవర్‌లో 18 పరుగులివ్వడంతో ఆఖరి ఓవర్‌లో గుజరాత్ విజయానికి 27 పరుగులు అవసరమయ్యాయి. దురదృష్టవశాత్తు తొలి బంతికి తెవాటియా రనౌటవ్వగా.. రెండో బంతిని రూథర్‌ఫోర్డ్ సిక్సర్‌తో ఆశలు రేకెత్తించాడు. కానీ అతన్ని అర్ష్‌దీప్ సింగ్ క్లీన్ బౌల్డ్ చేసి విజయలాంఛనాన్ని పూర్తి చేశాడు. ఆఖరి బంతికి షారూఖ్ ఖాన్ భారీ సిక్సర్ బాదినా.. ఫలితం లేకపోయింది.



## క్రీజు నుంచి తోసి..
# కుల్దీప్ యాదవ్‌ను ఆటపట్టించిన పంత్..

**బలగం టీవీ, హైదరాబాద్**

లక్నో సూపర్ జెయింట్స్ కెప్టెన్ రిషబ్ పంత్ ఢిల్లీ క్యాపిటల్స్ తో జరిగిన మ్యాచ్ లో కుల్దీప్ యాదవ్‌ను ఆటపట్టించాడు. వారిద్దరికి సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. అందులో రిషబ్ పంత్ కుల్దీప్ ను క్రీజులో నుంచి తోస్తున్నట్లు కనిపిస్తోంది. లక్నో తరపున రవి బిష్ణోయ్ 18వ ఓవర్ వేస్తున్నాడు. రవి బిష్ణోయ్ వేసిన ఓవర్ రెండో బంతిని కుల్దీప్ యాదవ్ కొట్టబోయాడు. కానీ ఆ బంతి వికెట్ కీపర్ రిషబ్ పంత్ చేతిలోకి వెళ్లింది. అతను స్టంప్స్ పైకి కొట్టడానికి ప్రయత్నించాడు. కానీ కుల్దీప్ క్రీజులోనే ఉన్నాడు. ఆ తర్వాత రిషబ్ పంత్ సరదాగా కుల్దీప్ ను క్రీజు నుంచి బయటకు నెట్టేసి వికెట్స్ పై ఉన్న బెయిల్స్ కింద పడేశాడు. ఇద్దరి మధ్య జరిగిన ఈ ఫన్నీ సంఘటన సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

# సౌత్ నిర్మాతలను చూసి సినిమాలు తీయడం నేర్చుకోవాలి



- **నటుడు సన్నీ డియోల్**

**బలగం టీవీ, హైదరాబాద్**

బాలీవుడ్ నటుడు సన్నీ డియోల్ నటిస్తున్న చిత్రం జాట్ చిత్రం. ఈ మూవీకి గోపీచంద్ మలినేని దర్శకుడు. ఈ సినిమ ట్రైలర్ రిలీజ్ విడుదలవగా.. మంచి రెస్పాన్స్ వస్తున్నది. ఈ మూవీ కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ట్రైలర్ లాంచ్ సందర్భంగా హీరో సన్నీ డియోల్ బాలీవుడ్‌కు కీలక సూచనలు చేశాడు. దక్షిణాది చిత్ర పరిశ్రమల నిర్మాతలను ప్రశంసిస్తూ.. బాలీవుడ్ ఫిల్మ్ మేకర్స్ వారిని చూసి సినిమాలు తీయడం నేర్చుకోవాలని సూచించారు. దక్షిణాది చిత్ర పరిశ్రమలో నటీనటులను గౌరవించే పద్ధతి తనను ఆకట్టుకుందని చెప్పాడు. సినిమా నిర్మాణంలో స్పష్టత బాలీవుడ్‌కు ఆదర్శనీయమని చెప్పాడు. టాలీవుడ్‌తో కలిసి పనిచేయడం తనకు నచ్చిందని చెప్పారు. నిర్మాతలతో మరో సినిమా చేద్దామని చెప్పాని.. బహుశా నేను అక్కడే (దక్షిణాది) స్థిరపడుతానని తెలిపాడు.ఒకప్పుడు బాలీవుడ్‌లో దర్శకులు చెప్పినట్లుగా నిర్మాతలు చేసేవారని.. కానీ, ప్రస్తుతం పరిస్థితులు మారాయని, కమర్షియల్ అంశాలకే ప్రాధాన్యం ఇస్తుండడంతో బాలీవుడ్ సినిమాలపై ప్రేక్షకులు ఆసక్తిని కోల్పోయారన్నారు. అందరు బాలీవుడ్ అని పిలుస్తారని.. తాను మాత్రం హింద్రీ చిత్ర పరిశ్రమగానే పిలుస్తానని చెప్పాడు. 'జాట్' మూవీ గురించి మాట్లాడుతూ.. ఈ మూవీ ప్రయాణం గదర్-2 సమయంలో మొదలైందని తెలిపాడు. దర్శకుడు గోపీ మలినేనిని గోవాలో కలిసినట్లు తెలిపాడు. ఆ సమయంలోనే సినిమా స్టోరీ చెప్పినట్లు వివరించారు. సన్నీ డియోల్ నటిస్తున్న 'జాట్' మూవీలో సయామీ ఖేర్, రెజీనా హీరోయిన్లుగా నటిస్తున్నారు. రణదీప్ హుడా, వినీత్ కుమార్ సింగ్ కీలక పాత్రలో నటించనున్నారు. ఈ చిత్రం ఏప్రిల్ 10న థియేటర్లలో విడుదల కానుండగా.. మైత్రీ మూవీ మేకర్స్, పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ నిర్మిస్తున్నాయి.



# వివాదంలో హర్భజన్ సింగ్

- **అర్చర్‌పై వివాదాస్పద వ్యాఖ్యలు**

**బలగం టీవీ, హైదరాబాద్**

టీమ్ఇండియా మాజీ స్పిన్నర్ హర్భజన్ సింగ్ ఇంగ్లండ్ పేసర్ జోఫ్రా ఆర్చర్‌పై అతడు చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. ఆదివారం సన్‌రైజర్స్ హైదరాబాద్, రాజస్థాన్ రాయల్స్ మధ్య జరిగిన మ్యాచ్‌లో ఆర్చర్ భారీగా పరుగులు సమర్పించుకున్న నేపథ్యంలో హిందీ కామెంట్రీ చెబుతున్న భజ్జీ.. 'లండన్‌లో నలుపు రంగు క్యాబ్స్ మీటర్ల మాదిరిగానే ఇక్కడ (మ్యాచ్‌లో) ఆర్చర్ మీటర్ సైతం పెరుగుతూనే ఉంది' అని వ్యాఖ్యానించాడు. దీంతో సోషల్ మీడియాలో భజ్జీపై విమర్శలు వెల్లువెత్తాయి. అతడి వ్యాఖ్యలు జాత్యాహంకారం కిందకే వస్తాయని ఆరోపిస్తూ..కామెంట్రీ నుంచి తప్పించాలని నెటిజన్లు డిమాండ్ చేస్తున్నారు.

## టికెట్ ధరల పెంపుపై 'రాబిన్‌హుడ్' మేకర్స్ క్లారిటీ

**బలగం టీవీ, హైదరాబాద్**

ఉగాది సందర్భంగా విడుదలయ్యే కొత్త సినిమాల టికెట్ ధరల పెంపునకు ఏపీ ప్రభుత్వం అనుమతి ఇచ్చిందనే వార్త నెట్టింట వైరల్‌గా మారింది. నితిన్ 'రాబిన్‌హుడ్'తో పాటు 'మ్యాడ్ స్క్వేర్' చిత్రాల టికెట్ ధరల పెంపునకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిందనేది వార్తలు సోషల్ మీడియాలో వస్తున్నాయి. ఈ అంశంపై తాజాగా రాబిన్‌హుడ్ మేకర్స్ స్పందించారు. ఈ నేపథ్యంలోనే సోషల్ మీడియా వేదికగా కీలక ప్రకటన చేశారు. ఏపీలో కొన్ని ఎంపిక చేసిన ప్రీమియం థియేటర్లలోనే టికెట్ ధరల పెంపు ఉంటుందని చిత్ర యూనిట్ తెలిపింది. ఏపీలో మిగతా థియేటర్లలోనూ, తెలంగాణలో పూర్తిగా... టికెట్ ధరల పెంపు ఉండదని, సాధారణ టికెట్ ధరలకే సినిమా చూడొచ్చని ప్రకటించింది. టికెట్ ధరల పెంపుపై జరుగుతున్న ప్రచారాన్ని కొట్టిపారేసింది. అభిమానులకు సరసనమైన ధరలకే ఎంటర్‌టైన్మెంట్ ఇవ్వాలని నిర్ణయించుకున్నట్లు పేర్కొంది. సమీప థియేటర్లలో ఈ నెల 28న రాబిన్‌హుడ్ సినిమా చూసి ఆనందించాలని మేకర్స్ కోరారు.

## డేవిడ్ వార్నర్‌కు రాజేంద్ర ప్రసాద్ క్షమాపణ

**బలగం టీవీ, హైదరాబాద్**



యూత్ స్టార్ నితిన్ హీరో శ్రీలీల హీరోయిన్ గా దర్శకుడు వెంకీ కుడుముల తెరకెక్కించిన అచిత్రం "రాబిన్ హుడ్". ఆదివారం హైదరాబాద్‌లో ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆసీస్ క్రికెటర్ డేవిడ్ వార్నర్ ప్రత్యేక అతిథిగా విచ్చేశాడు. అయితే, రాబిన్‌హుడ్ ఈవెంట్‌లో వార్నర్‌పై సీనియర్ నటుడు రాజేంద్ర ప్రసాద్ అనుచిత వ్యాఖ్యలు చేశారు.దీంతో నెటిజన్లు ఆయనపై దుమ్మెత్తిపోశారు. ఈ నేపథ్యంలో తాను వార్నర్‌ను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలపై తాజాగా రాజేంద్ర ప్రసాద్ స్పందించారు. తాను ఆ వ్యాఖ్యలు ఉద్దేశపూర్వకంగా చేసినవి కావని, తన మాటలు ఎవరినైనా నొప్పిస్తే సారీ అని అన్నారు. తనకు వార్నర్ అంటే ఎంతో ఇష్టం అతనికి మన సినిమాలు అంటే ఎంతో ఇష్టం అని తెలిపారు. అయితే వార్నర్ ని తాను ఉద్దేశ పూర్వకంగా అనలేదు అని ఒకవేళ ఈ విషయంలో ఎవరైనా బాధించబడి ఉంటే వారికి క్షమాపణలు తెలుపుతున్నాను అని రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. ఈ చిత్రంలో ప్రముఖ ఆస్ట్రేలియన్ డాషింగ్ క్రికెటర్ డేవిడ్ వార్నర్ కూడా ఉన్న సంగతి తెలిసిందే.



# 'కన్నప్ప' నుంచి రఘుబాబు పోస్టర్ విడుదల

**బలగం టీవీ, హైదరాబాద్**

టాలీవుడ్ కథానాయకుడు మంచు విష్ణు డ్రీమ్ ప్రాజెక్ట్ 'కన్నప్ప' ఏప్రిల్ 25న థియేటర్లోకి రాబోతోంది. అవా ఎంటర్టైన్మెంట్, 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ బ్యానర్లపై మోహన్ బాబు ఈ చిత్రాన్ని నిర్మించగా.. ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వం వహించారు. తాజాగా ఈ సినిమా నుంచి రఘుబాబు పాత్రకు సంబంధించిన పోస్టర్‌ను రిలీజ్ చేశారు. కన్నప్ప చిత్రంలో రఘుబాబు 'మల్లు' అనే ఓ పాత్రను పోషించారు. ఈ కారెక్టర్‌ను రివీల్ చేస్తూ వదిలిన పోస్టర్ అందరినీ ఆకట్టుకునేలా ఉంది. రఘుబాబు ఈ పోస్టర్లో ఆగ్రహంగా కనిపిస్తున్నారు. ఇప్పటికే శివయ్యగా అక్షయ్ కుమార్, పార్వతీ మాతగా కాజల్ అగర్వాల్, రుద్రుడిగా ప్రభాస్, మహదేవ శాస్త్రిగా మోహన్ బాబు పాత్రలకు సంబంధించిన పోస్టర్లు అందరినీ ఆకట్టుకున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం ట్రైలర్‌ను రిలీజ్ చేసేందుకు కన్నప్ప టీం సంసిద్ధం అవుతోంది. ఏప్రిల్ 25న ఈ చిత్రాన్ని తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ, హిందీ భాషల్లో రిలీజ్ చేయబోతోన్నారు.